
# మైల

జె.యు.బి.వి. ప్రసాద్

**తం**డ్రి పోయాడన్న వార్త విని మధు తల్లడిల్లి పోలేదు. ఇది రేపోమాపో జరుగుతుందని, పూట పూటా ఫోనులో వింటున్నదే. దానికి మానసికంగా తయారుగానే వున్నాడు.



నెలరోజుల కిందట వెళ్ళి, అన్ని రోజులూ తండ్రి దగ్గరే వుండి, అమెరికా తిరిగివచ్చి, వారం రోజులు మాత్రమే నిండాయి. ఎనభై అయిదేళ్ళ వయసులో ఊపిరితిత్తుల వ్యాధితో మూడుసార్లు ఆస్పత్రిలో వున్న వృద్ధుడు ఎంత ఆరోగ్యంగా వుండగలుగుతాడు? తండ్రి అయినా, ఎంత ప్రేమాస్పదుడైనా, ఆయన ఇంకా జీవించాలని ఆశించడం ఎంత భావ్యం? ఆ బాధని ఓర్చుకోక ఏం చెయ్యగలరు? తల్లితో ఫోనులో మాట్లాడాడు మధు.

''వెంటనే బయలుదేరి, రా నాయనా! మీ నాన్నకి తల కొరివి పెట్టి పున్నామ నరకం నుంచి తప్పించాల్సింది నువ్వే. అది నీకే విధాయకం'' అంటూ దుఃఖాన్ని అణుచుకుంటూ శాస్త్రం చెప్పింది తల్లి.

''అమ్మా! నేను ఈ రాత్రికే బయలుదేరి వచ్చినా, అక్కడికి వచ్చేసరికి రోజున్నర పడుతుంది. అప్పటివరకూ నాన్న శరీరాన్ని అయిసు గడ్డల్లోనూ, బాక్సులోనూ పెట్టి వుంచొద్దు. శరీరం ఉబ్బిపోయి చూడ్డానికి ఘోరంగా వుంటుంది. నిన్నటిదాకా చూసిన నాన్ననే గుర్తుపెట్టుకుంటాను. మీరే దహన కార్యక్రమాలు పూర్తి చేసెయ్యండి'' ఏడుపాపుకుంటూ అనునయంగా చెప్పాడు మధు.

''అయ్యో... అలాగా... రాలేవా?'' అన్నదే గానీ. అది నిర్లక్ష్యం కాదని కొడుకు మనసెరిగిన తల్లి, 'అలాగే' అన్నట్టు వూరుకుంది.

''అమ్మా! ఇంకో విషయం. బతికున్నంతకాలం మనం గౌరవంగా చూసిన నాన్న శరీరాన్ని, ఆయన పోగానే అవమానం చెయ్యొద్దు. ఇంటి బయట పడుకోబెట్టద్దు సుమా! పాడె మీద కట్టెయ్యడం లాంటివి చెయ్యొద్దు. ఏదయినా వేన్‌లో పడుకోబెట్టుకుని తీసుకువెళ్ళి దహనం చేసెయ్యండి. ప్రకృతి లోంచీ వచ్చిన శరీరం ప్రకృతిలోనే కలిసిపోతుంది. చాదస్తాలు పెట్టుకోవద్దు. నేనివాళే బయలుదేరి వస్తాను'' అని ఎక్కిళ్ళు ఆపుకుంటూ, ఏడుస్తూనే చెప్పాడు మధు.

తల్లి ఏమీ అనకుండా మౌనంగా దుఃఖించింది. కొడుకు దగ్గరే వున్నా, తండ్రి అంత్యక్రియల కోసం ఏ సాంప్రదాయాలూ పాటించడని ఆవిడకి తెలుసు. మధు నాస్తికుడని అందరికీ తెలుసు. మధు అంతో, ఇంతో పుస్తకాలు చదివి, చాలా స్థిరమైన అభిప్రాయాలు ఏర్పరచుకున్నాడు. అయినా సాంప్రదాయాల్ని నమ్మే తన వారందరితోనూ కూడా అభిమానంగానే వుంటాడు. తన అభిప్రాయాలన్నీ వాళ్ళ ముందు పెట్టి, వాది

స్తూనే వుంటాడు. అడిగిన వాళ్ళకీ, అడగని వాళ్ళకీ నాస్తిక పుస్తకాలు ఇస్తూనే వుంటాడు. చుట్టాల పిల్లల్లో ఇద్దర్నీ, ముగ్గుర్నీ ఆ పుస్తకాలు పట్టుకుని వదలని రకంగా తయారుచేశాడు కూడా.

తండ్రికి శాస్త్రప్రకారం తలకొరివి పెట్టడం మధుకి ఇష్టంలేదు. తండ్రి ఆస్పత్రిలో వున్నప్పుడే ఆ విషయాలు ఆలోచించి నిర్ధారణ చేసుకున్నాడు. సాంప్రదాయం పాటించే పని అతను ఎంతమాత్రమూ చెయ్యలేడు. తను చేసేదీ ఏమీ లేనప్పుడు, ఆ దేహాన్ని తన కోసం ఉంచడం ఎందుకు? ఆ సాంప్రదాయాలన్నీ అల్లుడు చూసుకోక మానడు. తల్లిదండ్రులిద్దరూ కొంతకాలంగా కూతురి కుటుంబంతో కలిసి వుంటున్నారు. అక్క భర్తే తన మామగారి అంత్యక్రియల కార్యక్రమాలన్నీ చూసుకుంటాడని మధుకి తెలుసు. తను చెప్పినట్లు కాకుండా, ఆయన అన్నీ వాళ్ళ శాస్త్రప్రకారమే చేస్తాడని కూడా మధుకి తెలుసు. మరణించిన మనిషికీ అల్లుడికీ ఒకేరకం నమ్మకాలున్నాయి. మామగారి నమ్మకాల్ని బతికించే అల్లుడున్నాడు.

మధు విమానం టికెట్లు ఫైనల్ చేసుకునే పనిలో పడ్డాడు. సునందనీ, పిల్లల్నీ తీసుకెళ్ళడానికి టిక్కెట్లు దొరకలేదు. తనకి మాత్రం ఎమర్జెన్సీ కోటాలో ఒక టికెట్ దొరికింది. ఒంటరిగా బయలుదేరవల్సి వచ్చింది. ప్రయాణంలో నానా కష్టాలూ పడి, మొత్తానికి ఇండియా చేరేటప్పటికి రోజున్నర దాటింది. కుటుంబం అంతా కలిసి దుఃఖించి, కొంత తేరుకున్నారు.

ఇంట్లో మనిషి పోయినరోజున వచ్చిన చుట్టాలూ, స్నేహితులూ దహన కార్యక్రమం అయిపోగానే వెళ్లిపోయారు. ఇక ఇంట్లో మిగిలింది మధూ, అతని తల్లీ, అక్కా, బావా, మేనల్లుడూ మాత్రమే.

ఆ పూట పొద్దున పదింటికి అక్కా, బావా, వాళ్ళ పనులమీద బయటికెళ్ళినప్పుడు, మధు తల్లితో తండ్రి విషయాలు మాట్లాడుతూ కూర్చున్నాడు. కాలింగ్ బెల్ మోగింది. వెళ్ళి తలుపు తీశాడు. ఎవరో ఒక పెద్దావిడ, ఎప్పుడూ చూడని మనిషి వచ్చింది. లోపలికి రమ్మని చెప్పి తల్లిని పిలిచాడు. తల్లి వచ్చి, ఆవిడ ఇల్లుగలావిడనీ, ఈమధ్యనే వచ్చి మేడ మీద పోర్షనులో తన కుటుంబంతో వుంటోందని చెప్పింది. ఆవిడకి కుర్చీ వేశాడు. ఈ మాటా, ఆ మాటా మాట్లాడాడు కాసేపు. 'చచ్చిపోయిన వాడి కళ్ళు చారెడేసి' అన్నట్టు, ఆవిడ మధు తండ్రిని చాలా పొగిడింది.

''కాస్త కాఫీ తీసుకుంటారా?'' అని అడిగాడు మధు కాఫీ పెట్టడానికిలేస్తూ.

''వద్దండీ!'' అంటూ ఇల్లుగలావిడ చాలా కంగారుపడింది.

''ఆవిడ అది తాగరు'' అంది తల్లి వుదాసీనంగా.

''ఓ! మీకు కాఫీ అలవాటు లేదా! పోనీ టీ తీసుకుంటారా?'' అన్నాడు మళ్ళీ.

ఆవిడ కాస్త ఇబ్బందిగా నవ్వి వూరుకుంది. కాసేపు కూర్చుని వెళ్ళిపోయింది.

''ఆవిడకి కాఫీ అలవాటు లేకపోవడం కాదురా! నిద్రలేచీ, లేవగానే కాఫీ కావాలి ఆవిడకి. మనకి 'మైల' కదా? ఆవిడకి మడీ, ఆచారాలు ఎక్కువ. 'మైల' వాళ్ళింట్లో కాఫీ తాగదు కదా!'' అంది తల్లి.

ఒళ్ళు మండిపోయంది మధుకి.

''ఈరోజుల్లో కూడా మడీ, మైలానా?'' అన్నాడు విసురుగా.

''ఎవరి నమ్మకాలు వాళ్లవి కదా!'' అంది తల్లి అనునయంగా.

ఆ రాత్రి భోజనాలప్పుడు చెప్పింది మధు అక్క.

''ఈరోజుతో మాకు మూడు రోజుల 'మైల' అయిపోతుంది. మీకు మాత్రం పన్నెండు రోజులుంటుంది. రేపట్నుంచి మేము అటువైపు గదుల్లో వుంటాము. మీరు అటు రాకండి'' అంది.

ఆశ్చర్యపోయాడు మధు.

''అదేమిటీ? కొడుకుని నాకు మైల వుంటే, కూతురివి నీకెందుకు వుండదూ? నీకు మాత్రం నాన్న కాడా?'' అడిగాడు మధు

''పెళ్ళయ్యాక ఇంటిపేరు మారింది కాబట్టి, మాకు 'మైల' మూడురోజులే. నీకూ, అమ్మకి అలా కాదు. మీ బావగారికీ, నాకూ ఆ పట్టింపులున్నాయిగా!'' అంది అక్క.

మళ్ళీ ఒళ్ళు మండింది మధుకి.

''అంటే రేపట్నించీ మీరంతా నన్నూ, అమ్మనీ అంటరానివాళ్లలాచూస్తారన్నమాట. కూతుర్నంటూ అభిమానం, ప్రేమా అంటావే గానీ, ఇదన్నమాట అమ్మంటే నీకున్న ప్రేమ! నీకు పెళ్ళయింది కాబట్టి, ఇంక నువ్వు మా కుటుంబంలో మనిషివి కాదన్నమాట. కూతుళ్ళు తండ్రి ఆస్తిలో హక్కు అడుగుతారే గానీ, 'మైల'లో బాధ్యత తీసుకోరన్నమాట. బాగుందక్కా మీ సాంప్రదాయం'' అంటూ దెప్పి పొడిచాడు మధు.

''అంటే రేపట్నించీ మీరంతా నన్నూ, అమ్మనీ అంటరాని వాళ్లలా చూస్తారన్న మాట. కూతుర్నంటూ అభిమానం, ప్రేమా అంటావే గానీ, ఇదన్న మాట అమ్మంటే నీకున్న ప్రేమ! నీకు పెళ్ళయింది కాబట్టి, ఇంక నువ్వు మా కుటుంబంలో మనిషివి కాదన్నమాట. కూతుళ్ళు తండ్రి ఆస్తిలో హక్కు అడుగుతారే గానీ, 'మైల'లో బాధ్యత తీసుకోరన్నమాట. బాగుందక్కా మీ సాంప్రదాయం''

అక్క కొంచెం నవ్వి, ''నువ్వేమన్నా సరే! నేను చెప్పదలచుకున్నది చెప్పాను. అంతే'' అంది.

మధు మాట్లాడలేదు. కాసేపటికి అక్కే మళ్ళీ అంది.

''మళ్లీ మీరు వేరే వంట ఎందుకూ? నేనే రోజూ మా గదుల్లో వండి, మీకు గిన్నెల్లో ఇస్తాను'' అని.

మధుకి అది ఎంతమాత్రమూ నచ్చలేదు.

''అక్కరలేదక్కా! ఆమాత్రం వంట అమ్మకీ, నాకూ కూడా నేను చేసుకోగలను. మానించీ వేరేగా వుంటున్న నీకు ఆ కష్టం కూడా ఎందుకూ?'' అన్నాడు నిర్లిప్తంగా.

''నేను చేసిపెడతానంటే, వద్దంటావేమిటీ? మళ్ళీ ఒకే ఇంట్లో రెండు వంటలెందుకూ?'' గట్టిగా అడిగింది అక్క.

''ఒకే ఇంట్లో వేరే, వేరేగా వుంటున్నప్పుడు, వేరే వేరే వంటలు మాత్రం యెందుకు వుండకూడదూ?'' అన్నాడు మధు.

తమ్ముడి పద్ధతిని మార్చడం తనవల్ల కాదని వూరుకుంది అక్క. తల్లి కూడా యేమీ అనలేదు.

అప్పటికి వూరుకున్నాడు గానీ, మర్నాటినించీ సందు దొరికినప్పుడల్లా, అక్కని సతాయిస్తూనే వున్నాడు మధు.

అప్పటినుంచీ మంచినీళ్ళు పట్టుకోవడానికి ఇంటావిడతో పెద్దగొడవ వచ్చి పడింది. ఈ 'మైల' వాళ్ళు పంపు ముట్టుకోకూడదట. ఇంటివాళ్లే ఆ పంపుకి ఒక రబ్బరు గొట్టం పెట్టి వదిలితే, అందులో నుంచీ పడే నీళ్లు పట్టుకోవడం అంతకుముందు జరుగుతున్న పని. ఇప్పుడైతే ఆ రబ్బరు గొట్టాన్ని కూడా వీళ్ళు ముట్టుకోకూడదుట. వేరే గదుల్లో 'మైల' లేకుండా వుంటున్న అక్కా వాళ్ళు పైపు ముట్టుకుని నీళ్ళు పట్టుకుంటారన్నా, ఇల్లుగలావిడ ఒప్పుకోలేదు. వాళ్లంతా ఇంట్లో 'మైల' సరిగా పాటిస్తారన్న నమ్మకం ఆవిడకి లేదట. ''ఈ పది, పన్నెండు రోజులూ తాగే నీళ్ళు బయటినుంచీ కొనుక్కోండి'' అని చెప్పిందావిడ.

వీళ్ళు ఆలాగే యాతనలు పడుతున్నారు. మధూ అంతా విని, మండిపడిపోయాడు.

''ఇప్పుడే నేను మేడ మీదకెళ్ళి ఇల్లుగలావిడని అడుగుతాను. ఎంత ఓనరైతే మాత్రం ఏవిటీ పెత్తనం? నేను రేపట్నించీ పైపు పెట్టి నీళ్ళు పడతాను. ఏం చేస్తారో చేసుకోమను వాళ్ళను'' అన్నాడు.

''వొద్దు నాయనా! రెండు వారాల్లో నువ్వెళ్ళిపోతావు. ఈ ఇంట్లో తిరగాల్సింది మేమూ. ఇల్లు అన్నింటికీ సౌకర్యంగా వుంది. అందుకే వాళ్ళకి అంత బెట్టు. పోనీలే, కొన్నాళ్ళు సర్దుకుందాం. ఆవిడ చెప్పినట్టు నీళ్ళు కొనుక్కుందాం. నా మాట విను కాస్త'' అంటూ బతిమాలింది తల్లి.

చేసేదేమీ లేక, పళ్ళు నూరుకుంటూ వుండిపోయాడు. అప్పట్నించీ ఇంటికి పరామర్శకి వచ్చిన వాళ్ళని మర్చిపోకుండా అడిగేవాడు.

'మీరు ఇంటికెళ్ళాక బట్టలు తడిపి, స్నానాలు చేస్తారా?'' అని.

ఎక్కువమంది, ''అయ్యో! చెయ్యకుండా 'మైల'ని ఇంట్లో కలుపుకుంటామా?'' అనేవాళ్ళు.

ఒకసారి మేనమామ కొడుకూ, కూతురూ వచ్చారు పరామర్శించడానికి. వాళ్ళు దగ్గరకు రాబోతుంటే, ''దూరంగా వుండండి. మమ్మల్ని ముట్టుకుంటే మీరు ఇంటికెళ్ళి స్నానాలు చెయ్యాలి. ఎందుకొచ్చిన బెడద మీకు?'' అన్నాడు కినుకగా.

''మాకలాంటి నమ్మకాలు లేవు బావా! మా పిల్లాడు కూడా నీలాగే అంటాడు. 'శరీరం వున్నప్పుడైతే శుభ్రంకోసం స్నానాలు గానీ, ఈ మైలలేమిటీ, పాడు' అంటాడు. మాకూ అదే అలవాటయిపోయింది'' అంటూ మేనత్త పక్కనే కూర్చుంది మేనకోడలు.

ఆవిడా దేముళ్ళ మీద నమ్మకాలున్న మనిషే. అయినా ఈ విషయంలో ఆవిడ మాటలకి ముచ్చటపడిపోయాడు మధు. సంతోషంతో బోర్నవిటాలు కలిపిచ్చాడు వాళ్లకి.

అసలు చర్చ ఆ మర్నాడు మొదలయింది. అక్క మొదలుపెట్టింది.

''మధూ! నాన్న పోయాక, పదోరోజూ, పన్నెండోరోజు కార్యక్రమాలుంటాయి. ఈమధ్యలో చిన్నచిన్నవి ఏవో వున్నా, అవన్నీ మీ బావగారు చూసుకుం

టారనుకో. పదోరోజూ, పన్నెండో రోజూ మాత్రం కొడుగ్గా నువ్వే చెయ్యాలి. అందరూ వస్తారు కదా, ఏం బాగుంటుంది?'' అంది అక్క.

మధు ఆశ్చర్యపోయాడు. అంతలో బావగారు అందుకున్నారు.

''రేపు మీ నాన్నగారి అస్థికలు తీసుకుని బాసరలో నిమజ్జనం చెయ్యాలి. నువ్వూ వస్తావా?'' అడిగాడు.

''నా గురించి మీకు తెలియదా? నాకా నమ్మకాలు లేవు'' అన్నాడు మధు స్థిరంగా.

''నీకు లేకపోతేనేం, మీ నాన్నగారికి వున్నాయిగా? ఆయనకోసం చెయ్యాలిగా?'' అన్నాడు అల్లుడు.

''ఆయన చేసుకోగలిగేవే ఆయన కోసం జరుగుతాయి. చేసేది నేనైతే, నా అభిప్రాయం ప్రకారం చేస్తాను కదా?'' అన్నాడు మధు.

కొడుక్కీ, అల్లుడికీ ఘర్షణ జరుగుతుందని తల్లి భయపడింది.

''పోనీలెండి! వాడికి నమ్మకం లేకపోతే వాడినొదిలెయ్యండి. అల్లుడయినా కొడుకులాంటి వారు మీరు. మీరే అదంతా చూసుకోండి'' అని సర్దిచెప్పింది అల్లుడికి.

ఈ నిమజ్జన కార్యక్రమం ఆపాలని మధుకి ఎంతగాఅనిపించినా, సాధ్యం కాలేదు. ఫలానా రోజు అల్లుడు బయల్దేరేలాగా నిర్ణయం అయిపోయింది. ఇప్పుడు అక్క పెద్ద కార్యక్రమం గురించి అడుగుతోంది.

''అక్కా! నా సంగతి తెలుసు కదా! తెలియనట్టు మాట్లాడుతావేం? నాకా నమ్మకాలే లేవు. నేనవేవీ చెయ్యను. నాకు ఇష్టం లేదు'' అని గబగబా చెప్పేశాడు.

''మరి మాకు వున్నాయి నమ్మకాలు. మేమేం చెయ్యాలి? నాన్నకోసం జరగాల్సింది జరగాలా, లేదా?'' పాయింటు తీసింది అక్క.

''మీ ఇష్టం వచ్చినట్టు [illegible]రు చేసుకోండి. నేను వొద్దన్నానా? నేను అమ్మతో వుండటానికే వచ్చాను. ఈ రెండు వారాలూ అమ్మనం[illegible]పెట్టుకునే వుంటాను. ఇంకేమీ చెయ్యను'' చెప్పేశాడు.

తల్లి మళ్ళీ అందుకుంది.

''వాడికిష్టం వచ్చినట్టు వాడినొదిలెయ్యవే! బ్రాహ్మడి చేత ఆ తతంగాలే[illegible] మీ ఇద్దరూ చేయించండి'' అని తల్లి మార్గం చెప్పింది.

ఆ తర్వాత, తల్లీ కూతుళ్లిద్దరూ చాలా విషయాలు మాట్లాడుకున్నారు. స్వర్ణదానం, గోదానం, భూదానం, ఇంకా ఆ దానం, ఈ దానం, ఏవేవో దానాలన్నారు. బోలెడుమందిని భోజనాలకి పిలవాలన్నారు. పదవరోజు ధర్మోదకాలు వదలాలన్నారు. పన్నెండో రోజు పెద్దకర్మ అన్నారు. మధ్యలో ఇంకా ఏవేవో చెయ్యాలన్నారు. ఆ మాటలన్నీ కంపరంగా వింటూ కూర్చున్నాడు మధు. పెళ్ళి జరుగుతోందో, చావు జరుగుతోందో అర్థం కాలేదు. ఏమన్నా అంటే 'చావుని పెళ్ళితో సమానంగా చెయ్యాలి' అనే సూక్తి చెప్తారని వూరుకున్నాడు.

అప్పుడే హఠాత్తుగా అసలు విషయం తట్టింది మధుకి. హడలిపోతూ లేచాడు.

''అమ్మా! ఆ పదవరోజు నువ్వు బొట్టూ, గాజులూ తియ్యడానికి వీల్లేదు. అవి నీకు భర్తతో రాలేదు. కావాలంటే భర్తతో వచ్చినవాటిని తీసెయ్యి. ఇంకో విషయం. తెల్లచీరలు కట్టుకోవడానిక్కూడా వీల్లేదు. ఇప్పుడు కట్టుకునే చీరలే కట్టుకో'' అన్నాడు ఆత్రుతగా, ఒప్పుకుంటుందా అని భయంగా చూస్తూ.

అక్క కోపంగా, ''అమ్మ ఎలా చేసుకోవాలో, అది అమ్మ ఇష్టమా, నీ ఇష్టమా?'' అంది.

''అమ్మ ఇష్టమే. నా ఇష్టం ఎలా అవుతుంది? అమ్మకి నేను సలహా ఇస్తున్నాను''

''సలహా ఇస్తున్నట్టు లేదులే, బెదిరిస్తున్నట్టు వుంది. కొడుక్కెక్కడ కోపం వస్తుందోనని, అమ్మకి భయంవేసేలా వుందది'' అంది అక్క వెటకారంగా.

''ఫరవాలేదులెండి. నించుంటాను. సోఫా మీద గుడ్డ కవరుంది కదా? ఇంత రాత్రప్పుడు ఇంటికెళ్ళి స్నానం అదీ, అంతా హైరానా అవుతుంది లెండి. ఏం చేస్తాం లెండి? పెద్దవాళ్ళయిపోయాక తప్పదు కదా? మీ తిరుగు ప్రయాణం ఎప్పుడు? వెళ్తానండీ, మళ్ళీ కలుస్తాను''

తల్లి అడ్డుపడి, ''ఈరోజుల్లో తెల్లచీరలెవరు కట్టుకుంటున్నారులే!'' అంది.

మధుకి పెద్ద బరువు తీరినట్టయింది. అక్కా తమ్ముళ్ళ మధ్య రుసరుసలు తగ్గి, కాసేపు మాటలు సాగాయి.

ఉన్నట్టుండి అడిగాడు మధు.

''అక్కా! ఈ తతంగాలన్నిటికీ ఎంత డబ్బు ఖర్చవుతుందీ?'' అని.

''ఒక యాభై వరకూ కావచ్చు'' అని జవాబిచ్చింది అక్క.

''ఏమిటీ, ఒకట్లా, వందలా?'' అడిగాడు కాస్త నవ్వు ముఖంతో.

''ఇంకా నయం! వేలు'' తల్లి అంది.

గుండెలు బాదుకున్నాడు మధు.

''యాభై వేలా! యాభై వేలా! అమ్మో! అంత డబ్బు తగలేసి ఇవన్నీ చెయ్యకపోతేనేం? దాని బదులు నాన్న పేరు మీద పేదవాళ్ళకి భోజనాలు పెడితే ఎంతో చక్కగా వుంటుంది. ఈ తతంగాలేవీ వద్దు. అనవసరం'' గట్టిగా అన్నాడు.

తల్లి మళ్ళీ తన పాశుపతాస్త్రం వేసింది.

''అది కాదురా! మన వాళ్ళందరూ నన్నంటారు. నీకేం. నువ్వెళ్ళి అమెరికాలో కూర్చుంటావు. ఇక్కడి సంఘంలో పద్ధతులు వేరు. వెలి వేసేస్తారు జనాలు. పెళ్ళిళ్ళకీ, పేరంటాలకీ మన కుటుంబాన్ని పిలవరు ఇంక. 'నలుగురితో నారాయణ' అని ఇక్కడున్నప్పుడు ఇక్కడి పద్ధతులే పాటించాలి. నువ్వలా చూస్తూ వూరుకో. మేం అవన్నీ చూసుకుంటాంగా'' అంటూ తల్లి చెప్పుకొచ్చింది.

మధుకి ఆ మాటలు నచ్చలేదు. తండ్రి మూడు సార్లు ఆసుపత్రిలో వున్నప్పుడు, తను డబ్బు ఖర్చుకి జంకకుండా ప్రతిసారీ పరిగెట్టుకు వెళ్ళాడు. ఆసుపత్రిలో మూడు లక్షల ఫీజులు చెల్లించాడు. తండ్రికోసం ఇంట్లో పెట్టుకోవడానికి ఆక్సిజన్ మిషను కొన్నాడు. తండ్రి వద్దంటున్నా, ఒక డాక్టరు రెగ్యులర్‌గా వచ్చి, తండ్రిని చూసేలా ఏర్పాట్లు చేశాడు. మళ్ళీ అవసరం వస్తుందని, కొన్ని లక్షలు బ్యాంకులో వేసి వెళ్ళాడు. డబ్బు ఖర్చుకు తను వెనుకాడడు. కానీ పూజలకోసం యాభై వేలా? ఎవరు తిన్నట్టూ? ఏం మంచి జరుగుతుంది? 'ఈ ఖర్చు మాత్రం నేను పెట్టను' అనంటే తల్లి వూరుకోవచ్చు గానీ, ఆ తర్వాత ఆవిడ జీవితాంతం బాధపడుతుందని తెలుసు. ఎవరన్నా బంధువులు ఏమన్నా అనకపోరూ, ఆవిడ బాధపడక పోదూ! యాభై వేలు పోతే పోనియ్యి అని మళ్ళీ నోరు కట్టేసుకున్నాడు.

తరచుగా బంధువుల నుంచీ, మరణవార్త తెలుసుకున్న వాళ్ళనుంచీ ఫోన్‌కాల్స్ వస్తూనే వున్నాయి.

వారం రోజుల తర్వాత, తల్లి ఏదో గుర్తొచ్చినట్టు, ''మధూ! మీ అత్తగారు ఫోను చేశారా?'' అని ఆరాగా అడిగింది.

''లేదమ్మా! అదే ఆశ్చర్యం. మా బావమరిది ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకున్నాక, ఇప్పటిదాకా మళ్ళీ కనబడలేదు. అతని సంగతి వొదిలెయ్యి. మా అత్తగారి విషయమే ఆశ్చర్యం. ఆవిడకి వొంట్లో బాగోలేదో, ఏమో? నిన్ను చూడ్డానికి రానే లేదుగా?'' అన్నాడు.

''పోనీలెద్దూ!'' అంది తల్లి, అంతకన్నా బాధగా మాట్లాడితే, అత్తగారి మీద కష్టపెట్టుకుంటాడేమోనని.

తల్లి ఇంకేమీ అనకుండా వూరుకున్నప్పటికీ గానీ, తర్వాత మేనత్తతోనూ, పెద్దమ్మతోనూ గుసగుసలుగా చెప్పుకోవడం చూసి, అత్తగారు తనని ఫోనులోనయినా పలకరించలేదని మళ్ళీ ఆశ్చర్యపడ్డాడు మధు.

ఆ రాత్రి పన్నెండు తర్వాత, అప్పుడే కాస్త నిద్రపడుతూ వుండగా, ఎవరో తలుపులు బాదారు. నిద్రకళ్ళతో తలుపు తీస్తే, ఎదురుగా బావమరిది శేఖర్. ఆశ్చర్యపోయాడు మధు.

''మీ ఫాదర్ పోయాక మళ్ళీ కలవడానికి చూద్దామనుకుంటే, కుదరనే లేదు'' అన్నాడు.

ఈ అర్ధరాత్రి కుదిరింది అతనికి.

''కూర్చోండి'' అంటూ సోఫావేపు చూపించాడు మధు.

''ఫరవాలేదులెండి. నించుంటాను. సోఫా మీద గుడ్డ కవరుంది కదా? ఇంత రాత్రప్పుడు ఇంటికెళ్ళి స్నానం అదీ, అంతా హైరానా అవుతుందిలెండి. ఏం చేస్తాం లెండి? పెద్దవాళ్ళయిపోయాక తప్పదు కదా? మీ తిరుగు ప్రయాణం ఎప్పుడు? వెళ్తానండీ, మళ్ళీ కలుస్తాను'' అంటూ గబగబా నాలుగు మాటలు దూసిపోసేసి, ''పడుకోండి. తర్వాత కలుద్దాం'' అని మెట్లు దిగి వెళ్ళిపోయాడు. లోపలికి రానేలేదు. 'మైల' భయం.

లోపలికి వచ్చిన మధుని, ''ఎవర్రా వచ్చిందీ'' అని అడిగింది తల్లి.

'శేఖర్ లే! పొద్దున్న సునందతో ఫోనులో మాట్లాడినప్పుడు, 'మీ తమ్ముడేమిటీ, మళ్ళీ కనబడలేదే?' అన్నాను. ఆశ్చర్యపోయింది. అతనికి ఫోను చేసి చెప్పినట్టుంది. మొక్కు తీర్చుకోవడం కోసం ఇంత అర్ధరాత్రి పూట కుదిరింది టైం అతనికి'' అని నిద్రలోకి జారుకున్నాడు మధు.

పోయిన మనిషి ఆత్మశాంతికోసం పదవరోజు కార్యక్రమం మొదలైంది. తల్లి తెల్లచీరలు మొదలుపెట్టలేదు. బొట్టు చెరుపుకోలేదు. మెళ్ళో గొలుసూ, కాళ్ళ పట్టాలూ తీసెయ్యలేదు. నగలూ, బొట్టూ ఎప్పట్లాగే వుంచుకుంది. అమ్మలక్కలందరూ, 'వెనకాల కాలం పనులు ఈ రోజుల్లో ఎవరు చేస్తున్నారులే' అన్నారు. ఆడవాళ్ళందరూ చక్కగా మారినందుకు మధు సంతృప్తిపడ్డాడు.

'కానీ వీళ్ళందరికీ, ఈ 'మైల' పిచ్చేమిటా' అని, అదే తల్చుకుని ఆశ్చర్యపడ్డాడు. 'ఫరవాలేదులే, ఈ అభ్యుదయమే పదివేలు' అనుకున్నాడు.

ఆ సాయంత్రం మేనత్త మాటల్లో, తల్లి శాస్త్ర ప్రకారం తలలో కాసిని వెంట్రుకలు కత్తిరించుకుందని తెలిసి నిర్ఘాంతపోయాడు. అడగడానిక్కూడా మన

స్కరించక వూరుకున్నాడు.

పదోరోజు ధర్మోదకాలు వదులుతారు. అంటే, బ్రాహ్మలు మంత్రాలు చదువుతూ వుంటే, కొందరు మగాళ్ళు మాత్రం స్నానాలు చేసి, తడి బట్టలతో చనిపోయినవారి పేరు మీద నీళ్ళు వదులుతారు. ఆ నీళ్ళు వేరే లోకాలకి చేరుకున్న ఆత్మ, దాహం వేసినప్పుడు తాగుతుందని వాళ్ళ నమ్మకం.

బావగారు ఇంకోసారి అడిగాడు.

''నువ్వు కూడా ధర్మోదకాలు వదులుతావా?'' అని.

మధు తల అడ్డంగా తిప్పాడు.

ఆ కార్యక్రమాలు ఇంట్లో చెయ్యడానికి ఇల్లుగలావిడ ఒప్పుకోలేదని, అందరూ సత్రంకి బయలుదేరారు. అల్లుడూ, వాళ్ళు ధర్మోదకాలు వదిలారు. తల్లితో వుండటమే తన కర్తవ్యం అనుకున్న మధు, తల్లినే అంటిపెట్టుకుని తిరిగాడు. సత్రంలో వ్యవహారాలు ముగిశాక, ఒక హోటల్‌కి తీసుకెళ్లారు. ఇల్లుగలావిడ పన్నెండోరోజు పూర్తయితే గానీ, రావద్దన్నదట. ఆవిడ మీద ఎంత కోపం వచ్చినా, అంత అర్జంటుగా ఇల్లు మారడం ఎంత సాధ్యం?

మధూ కోపంగా ''ఆవిడ రావద్దంటే అంతేనా? అద్దె ఇస్తున్నామా, లేదా? ఆ ఇంట్లో వుండడం మన హక్కు'' అని ఎంత వాదించినా కూడా తల్లి ఆ మాట పడనీయలేదు.

''పోనీలే, వాళ్ళతో గొడవెందుకు? రెండు రోజులు హోటల్లో గడుపుకుంటే పోయేదానికి? వాళ్ళ నమ్మకాలు వాళ్ళవి కదా? పోనియ్యి'' అని తల్లి కొడుక్కి సర్దిచెప్పింది.

అన్నింటికీ కాళ్ళ సంకెళ్ళే. ఎక్కడా ఎదురు తిరగడంలేదు. వాళ్ళు చెయ్యరు. చేసేవాళ్ళని చెయ్యనివ్వరు. విరక్తిపుట్టుకొచ్చేసింది మధుకి.

రెండు రోజులు ఆ జిడ్డు హోటల్లో నరకం అనుభవించాక, పన్నెండో రోజు కార్యక్రమం కోసం మళ్ళీ సత్రంకు వెళ్ళారు. అక్కడ మళ్ళీ పూజలు, మంత్రాలూ! సాయంత్రం దాకా ఏమిటేమిటో! ఆ గోలేమిటో పట్టించుకోకుండా, తల్లి పక్కనే కూర్చున్నాడు మధు.

అలా అభిమానంగా, ఇష్టంగా వుంటాడని ఆ నాస్తిక పుత్రుణ్ణి తల్లి భరిస్తోంది. 'మనిషి కష్టం, సుఖం అర్థం చేసుకోనీ, అభిమానం, ప్రేమా చూపించని ఈ సిద్ధాంతాలెందుకు, తగలెయ్యడానికి తప్ప' అని అనుకుంటాడు మధు.

ఆరోజన్నా అత్తగారు తన తల్లిని చూడ్డానికి వస్తుందా, రాదా అని మధుకి ఒకటే ఆలోచన.

సత్రంలో ఒకపక్క వంటలు జరుగుతున్నాయి. ఇంకోపక్క బ్రాహ్మణుడు ఏవేవో తతంగాలు చేసేస్తున్నాడు. మరింకోపక్క వస్తున్న వారికి టిఫిన్లు పెట్టి, కాఫీలు ఇస్తున్నారు. అప్పటివరకూ మొహం చూడని వాళ్ళు ఎంతమందో వచ్చారు. వచ్చిన వాళ్ళందరికీ, ఆ కార్యక్రమం కొడుకు చెయ్యకుండా, బ్రాహ్మణుడి చేత చేయిస్తున్నాడని ఒకటే ఆశ్చర్యం. మధు గురించి తెలిసిన వాళ్ళు తెలియని వాళ్ళ చెవులు కొరికారు.

బ్రాహ్మణుడు ఏదో తతంగం పూర్తిచేసి, దారిలో వున్న వాళ్ళ మీద తెల్లటి అక్షంతలు చల్లుతూ, మంత్రాలు చదువుతూ మధువేపు వచ్చి, అక్షంతలు అతని నెత్తిమీద వెయ్యబోయాడు. మధూ కోపంగా చూసి, 'అలా వెయ్యకండి' అన్నాడు.

ఆ బ్రాహ్మణుడు తెల్లబోయి, ''ఇదెక్కడి ముదనష్టపు కొడుకు'' అన్నట్టు ఆశ్చర్యంగా చూసి, ఇంకో పక్కకి వెళ్ళిపోయాడు.

అప్పుడు మూడో కూతురు నడిపిన మోపెడ్ వెనకాల నుంచీ దిగుతున్న అత్తగారిని దూరం నుంచీ చూశాడు మధు. డెబ్బైయేళ్ళు దాటిన ఈవిడ యేడు మైళ్ళు హైదరాబాద్ ట్రాఫిక్‌లో మోపెడ్ మీద కూర్చుని రాగలిగిందే అని ఆశ్చర్యపడ్డాడు.

మధు అక్క కుడిచెయ్యి గుప్పిట మూసి, దాన్ని వెనకాల పెట్టుకుని తమ్ముడి వెనకాల, వెనకాల తిరగడం మొదలుపెట్టింది, గుప్పెట్లో అక్షంతలు తమ్ముడి నెత్తిమీద చల్లాలని. తమ్ముడికరిష్టం పోతుందని. మధుకి అర్థం అయింది. వెనక్కి ఒక్క గెంతేసి, దూరంగా పోయి నిలబడ్డాడు.

''ఇలా రారా! నీకో మాట చెప్పాలి'' అంటూ పిలిచింది అక్క.

''ఆ మాటేమిటో తెలుసులే! నీ చేతిలో వున్నవి పారేస్తేనే, వస్తాను'' అన్నాడు కాస్త నవ్వుతూ.

ఇద్దరు పిల్లల తండ్రి అలా చిన్నపిల్లాడిలా మొండితనం చేస్తున్నట్టు, అక్కకి నవ్వొచ్చింది.

''సరేలే! వెయ్యనులే! ఇలా రా!'' అంటూ చేతిలో అక్షింతలు తన నెత్తిమీదే చల్లుకుంది.

అంతలో అత్తగారు, అక్క దగ్గరకు వచ్చి, సంచీలోంచి ఒక పేకెట్టు తీసి, అక్క చేతుల్లో పెడుతూ, ''అల్లుడికి శాస్త్రప్రకారం పెట్టాలమ్మా! మీ తమ్ముడికియ్యి'' అంది.

''మీకు తెలియదా మీ అల్లుడి సంగతి? వాడికి లాంటి నమ్మకాలు లేవు కదా? మీరు వూళ్ళోనే వుండి, తల్లిని చూడ్డానికి ఇప్పటిదాకా రాలేదని వాడు ఇదైపోతున్నాడు. బట్టలు తీసుకుంటాడా?'' అంది అక్క నిష్ఠూరంగా.

చిన్నబుచ్చుకుంది అత్తగారు.

''తెలుసమ్మా మీ తమ్ముడి సంగతి. అతనికి 'మైల' మీద నమ్మకం వుండదు. మా ఇంట్లో అలా వల్లకాదు. మీ అమ్మని చూడ్డానికి వద్దామనుకున్నాను గానీ, ఆ అబ్బాయి దగ్గరికి వచ్చి, 'అత్తయ్యగారూ, బావున్నారా?' అంటూ చేతులు పట్టుకుంటాడు. ఇంటికొచ్చి మంచం మీద కూర్చుంటాడు. అదంతా బాగుంటుందా, చెప్పు! ఈ పన్నెండు రోజులు అయ్యాక వద్దామనుకుంటున్నానమ్మా'' అని చెప్పుకొచ్చిందావిడ.

ఆ మాటలన్నీ మధు వింటూనే వున్నాడు. అందరూ వింటూనే వున్నారు. 'అవును, మరీ' అన్నట్టు అందరూ, 'వూ' కొట్టారు.

అప్పుడర్థం అయింది మధుకి అత్తగారి సంగతి. పెళ్ళయిన గత ఇరవై మూడేళ్ళలోనూ అత్తగారితో తను ఎంతో మంచిగా వున్నాడు. ఆవిడ దగ్గర నుంచీ ఒక చిన్న జేబురుమాలు కూడా వాళ్ళిచ్చినా తీసుకోలేదు, ఆ సాంప్రదాయాలు తనకి నచ్చవంటూ. ఇంట్లో మనిషిగా కలిసిపోయి, ఇల్లు వూడ్చాడొకసారి. ఇంకోసారి గిన్నెలు కడిగి, వంట చేశాడు. ఇండియా బయలుదేరేటప్పుడల్లా, సునందతో, 'మీ అమ్మగారి కోసం ఏమన్నా కొన్నావా, లేదా?' అని అడుగుతూనే వుంటాడు. సునంద అదంతా తల్లికి చెబుతూనే వుంటుంది. ప్రతిసారీ కలిసి అభిమానంగా మాట్లాడుతూ వుంటాడు. వాళ్ళింటికెళ్ళినప్పుడల్లా పక్కన కూర్చుని భోజనం కూడా చేస్తాడు. అవన్నీ, ఆవిడ 'మైల' నమ్మకం ముందు, గాల్లో కలిసిపోయాయి.

'మైల' పేరుతో తన సొంతక్కే వేరే గదుల్లో అంటకుండా, ముట్టకుండా తిరుగుతోంది. తల్లితో అక్క గురించో, బావ గురించో, ఏం చెప్పబోయినా, 'వాళ్ళ నమ్మకాలు కదా, వాళ్ళ నమ్మకాలు కదా' అంటోంది తల్లి. వాళ్ళ ప్రవర్తనకి తనెందుకు బాధపడుతున్నాడో తల్లి అర్థం చేసుకోదు. తన అత్తగారికి, తండ్రి పోయిన తనని ఒక్కసారి కూడా పలకరించాలనిపించలేదు. అల్లుడొచ్చి ఇంట్లో తిరిగి ఇల్లంతా 'మైల' చేస్తాడన్న భయమే కాని, ఇంకే అభిమానమూ లేదు మనసులో. తన తల్లి మాత్రం? తెల్లగుడ్డలు కట్టుకోవాలనే శాస్త్రాన్ని వదులుకుంది కదా? అలాగే కూతుర్ని మందలించడానికి చొరవ చెయ్యకూడదూ? 'వారం రోజులయితే వాడు ఎలాగా వెళ్ళిపోతాడూ, ఈ నాలుగు రోజులూ, పూటా పూటా కలిసి తినకుండా, ఏమిటీ చాదస్తాలు? పోయినాయన ఎలాగూ పోయారు. వున్నవాళ్ళం కలిసి బతక్కుండా, మీ వంట మీదీ, మా వంట మాదీనా?' అని అనగలిగిందా? ఏమన్నా అంటే 'పన్నెండు రోజులే కదా' అంటారు. పన్నెండు రోజులు పోయినట్టే కదా జీవితంలో? అంత విలువుందా 'మైల'కి? ఈ 'మైల' ముందు ప్రేమాభిమానాలన్నీ దిగదుడుపేనా?

★

